క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తిరూరల్: రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 సబ్ స్టేషన్‌ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ శంకరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 132/33 సబ్ స్టేషన్‌లో మరమ్మతు చేస్తుండడంతో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని జాజాల, శిర్సనగండ్ల, వెల్దండ, వంగూరు, కల్వకుర్తి 1, జగన్నాథపల్లి, మార్చాల, సూర్యలత కాటన్‌మిల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో అంతరాయం ఉంటుందని శంకరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెల్దండ: మండలంలోని రాచూర్, కుప్పగండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని ఏఈ సూర్యంనాయక్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన

కల్వకుర్తిరూరల్: మండలంలోని వెంకటాపూర్‌లో మంగళవారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, మార్చాలలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఆయా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

పెద్దకొత్తపల్లి: మండలంలోని ఉన్నత పాఠశాలకు చెందిన కె దామోదర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. దామోదర్ రాష్ట్ర స్థాయిలో 28 నుంచి భువనగిరిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. దామోదర్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు వాహనాల వేలం

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో మంగళవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం పాట ఉన్నట్లు తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల వారు ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని పేర్లు నమోదు చేయించుకోవాలని సీఐ తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కోడేరు: మండలంలోని తీగలపల్లి గ్లోబల్ స్కూల్‌లో స్పెల్‌బీ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీలలో కోడేరు అక్షరాభ్యాస స్కూల్, గుడిపల్లి గ్లోబల్ స్కూల్, ఈశ్వరయ్య స్కూల్ విద్యార్థులకు స్పెల్‌బీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, కరుణాకర్ తెలిపారు.

రెండో విడత దుస్తులు సిద్ధం



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండో విడత దుస్తులు సిద్ధం చేస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం శేఖర్ తెలిపారు. ఆయా గ్రామాలలోని మహిళా సంఘాల సభ్యులు కుట్టిన దుస్తులను పరిశీలించి పాఠశాలలకు పంపించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. మండలంలోని 37 పాఠశాలలోని బాలబాలికలకు దుస్తులు కుట్టడం పూర్తి అయినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేసిన ఏఓ

తిమ్మాజీపేట: మండల కేంద్రంలోని పలు ఎరువుల, విత్తనాల దుకాణాలను సోమవార మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్ తనిఖీ చేశారు. తెలంగాణ ఆగ్రో ఏజెన్సీ దుకాణంలో రికార్డులను పరిశీలించారు. ఎరువులు, క్రిమి సంహారక మందులకు సంబంధించిన స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పీహెచ్‌సీలో బోరు డ్రిల్లింగ్

బల్మూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల సౌకర్యార్థం సోమవారం ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ నిధులతో బోరు డ్రిలింగ్ చేయించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి తెలిపారు. పీహెచ్‌సీలో గత పదేళ్లుగా బోరు పని చేయడం లేదని తెలిపారు.



ఈగలపెంట జెన్‌కో కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు



లింగాలలో మార్కండేయ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా కార్తీక దీపోత్సవం

- అమరేశ్వరాలయంలో కోటి దీపాలు
- శివాలయాల్లో అభిషేకం, వ్రతాలు
- హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

సాక్షి, నెట్‌వర్క్: అమ్రాబాద్, పదర మండలాల్లో కార్తీకమాసం చివరి సోమవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రామాలయం, రాయలగండి క్షేత్రం, మద్దిమడు గు, పదరలో శివాలయం తదితర ఆలయాలు సందడిగా మారాయి. రాత్రి ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అమరేశ్వరాలయంలో భక్తులు కోటి దీపాలను వెలిగించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కోటి దీపోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంగిశెట్టి నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు హరినారాయణగౌడ్, తిరుమలయ్య పాల్గొన్నారు.



కోడేరు శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

- కోడేరు మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, తీగలపల్లి, మైలారం, నర్సాయిపల్లి తదితర గ్రామాల్లో శివాలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉమామహేశ్వరాలయంలో అభిషేకాలు, సామూహిక వ్రతాలు, సత్యనారాయణస్వామి వ్రతం, అన్నదానం నిర్వహించారు.
- లింగాల మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆకు పూజలు నిర్వహించారు.
- ఈగలపెంటలోని జెన్‌కో ఉద్యోగుల నివాస కాలనీలో ఉన్న సత్యనారాయణస్వామి గుడి వద్ద స్వామి వారికి అభిషేకం, వ్రతం నిర్వహించారు. భూగర్భ కేంద్రం సీఈ. రామసుబ్బారెడ్డి, ఎస్ఈ(సివిల్) రవీంద్రకుమార్, ఈఈ రమేష్ దంపతులు, ఏఈ లు, ఉద్యోగుల దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం ఎస్ఎల్‌బీహెచ్‌ఈఎస్ ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు డీఈ.లక్ష్మీనాయక్, ఏఈ శివదీప్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఉద్యోగుల కుటుంబాలు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని, స్వశక్తితో ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట ఏరియా అస్పత్రిలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపార రంగంతో మహిళలు స్థిరపడాలని, కోటీ మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ఇందిరా మహిళా శక్తి పథక లక్ష్యమన్నారు. చురుకైన మహిళలను గుర్తించి వారికి బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామనాథం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎ.గోపాల్‌రెడ్డి,కాశన్నయాదవ్,కటకం రఘురాం,రాజ్‌గోపాల్,ఆకుతోట రామనాథం పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై ఎంఎల్‌ఏతో సమావేశం

దోమలపెంట: దోమలపెంట గ్రామ ప్రజల ప్రధాన సమస్యలు రక్షిత మంచినీటి ఎద్దడి పరిష్కారం, అస్పత్రిలో వైద్యుడి నియామకం, వీధి దీపాలు ఏర్పాటు తదితర సమస్యలపై దోమలపెంట కాంగ్రెస్ అధ్యక్షుడు కె.మోయిజ్ ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు అచ్చంపేటలో ఎంఎల్‌ఏ వంశీకృష్ణను కలిసి విన్నవించినట్లు తెలిపారు.



అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సమస్యలు రాకుండా చూసుకుంటా

మన్ననూర్: అమ్రాబాద్ మండలం 'నా గుండె లాంటిది, నేను ఉన్నంత వరకు మండలంలోని ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండా చూసుకునే బాధ్యత తీసుకుంటా' అని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మన్ననూర్‌లో ముఖ్య కార్యకర్తలు, గ్రామ ప్రజలతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళలపై హింస నేరం

అమ్రాబాద్: మహిళలపై హింస నేరమని జిల్లా సఖి సెంటర్ లీగల్‌సెల్ అడ్వకేట్ సరిత అన్నారు. సోమవారం అమ్రాబాద్ ఎంకే ఫంక్షన్‌హాల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో స్త్రీ హింస నిర్మూలనా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీ సగభాగమని, స్త్రీల రక్షణ కోసం ఎన్నో చట్టాలు వచ్చినా, అక్కడక్కడా ఇంకా స్త్రీలపై హింస జరుగుతుండటం బాధాకరమన్నారు. సదస్సులో ఆర్డీటీ ఏటీఎల్ రామ్మోహన్, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ చంద్ర శేఖర్‌రెడ్డి, 60 జంట కుటుంబాల దంపతులు ఉన్నారు.

మహిళలు చైతన్యవంతం కావాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

లింగాల: మహిళలు చైతన్యవంతం అయినప్పుడే స్త్రీ హింస నిర్మూలన అవుతుందని ఎస్ఐ నాగరాజు అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని అంబట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ రాధ, సుధాకర్‌రెడ్డి, ఆర్డీటీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



రాంకొండలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ప్రత్యేకాధికారి రాములాల్



కల్వకుర్తి పాఠశాలలో కిరాణ సరుకులు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం

సాక్షి, నెట్‌వర్క్: వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం వడ్డించాలని కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం సూచించారు. పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు.

- కోడేరు మండలంలోని పస్పుల పాఠశాలను ఎంఈఓ భాస్కర్‌శర్మ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని తెలిపారు. అనంతరం రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు.
- ప్రతి విద్యార్థిలో సామర్థ్యాలు పెంచి చదవడం, రాయడం వచ్చేలా కృషి చేయాలని లింగాల ఎంఈఓ బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. లింగాల మండలంలోని చెన్నంపల్లి, పద్మన్నపల్లి పాఠశాలలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు.
- తెలకపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో ఎంఆర్‌సీ భవనంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం నిర్వహించారు. రాకొండలోని కస్తూర్బా పాఠశాలను తహసీల్దార్ జాకీర్‌అలీ, ఎంపీడీఓ శ్రీనివా సులు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి,మండల ప్రత్యేకాధికారి రాములాల్ మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

రామాజిపల్లిలో శివస్వాముల పూజలు

బల్మూర్: కార్తీక సోమవారం పురస్కరించుకొని మండలంలోని రామాజిపల్లి శివాలయంలో శివస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శివస్వాములు లక్ష్మయ్య, స్వామి, ఆంజనేయులు, గ్రామ పెద్దలు మోహన్‌రెడ్డి, శివ, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వనభోజనాలు



కల్వకుర్తిరూరల్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా వాసవీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని జూలూరు రమేష్‌బాబు తోటలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టు కింద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజలకు విచ్చేసిన వారందరు వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు గోవర్ధన్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కార్యదర్శి రమేష్, కోశాధికారి జగదీశ్వర్, ట్రస్ట్ కోశాధికారి నారాయణరాజు, శేఖర్, రవి, మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పూజలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం అయ్యప్పస్వాములు మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన అయ్యప్ప స్వాములు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులకు, స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ఫైర్ సేఫ్టీపై సూచనలిస్తున్న ఎస్ఐ క్రిష్ణమూర్తి

తిమ్మాజీపేట: అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఫైర్ సేఫ్టీ అధికారులు అవగాహన కల్పించారు. మండల కేంద్రం తిమ్మాజిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య అధికారులకు, సిబ్బందికి, ఆస్పత్రికి వచ్చిన వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అగ్ని ప్రమాద సంఘటనలు జరిగితే వాటిని ఎలా ఎదుర్కోవాలో డ్రిల్ చేసి చూపించారు. ఫైర్‌సేఫ్టీపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ క్రిష్ణమూర్తి చెప్పారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే 101కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన పథకాలపై కళాజాతా ప్రదర్శన

బల్మూర్: ఆరు గ్యారంటీల పథకాలపై ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా పురస్కరించుకోని ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేసిన పథకాలపై ఆట, పాటల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మణ్, కళాకారులు భాస్కర్, కృష్ణ, శివనాగులు, నరేందర్, శివయ్య, సికిందర్, పార్వతమ్మ, అస్మా, రేణుక, శైలజ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన పథకాలపై కళాకారుల ప్రదర్శన

మాలల సింహగర్జన విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా కన్వీనర్ మద్దెల చంటి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన జిల్లా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు.

కొల్లాపూర్‌లో సుందరీకరణ

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలో ప్రధాన రహదారి సుందరీకరణ పనులు చేపట్టారు. 27 నుంచి 29 వరకు నిర్వహించే ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాలకు రాష్ట్ర, జాతీయ స్థాయి అధికారులు, నాయకులు రానున్నారు. ఉత్సవాల ప్రారంభం నాటికి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనులను మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యవేక్షిస్తున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదానానికి దాతలు విరాళాలు అందజేశారు. భక్తులకు అందిస్తున్న అన్నదానం చూసి అచ్చంపేటకు చెందిన సూదిన జైపాల్‌రెడ్డి దంపతులు రూ.25వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

తాండ్రలో జేఏసీ ఏర్పాటు

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్ర గ్రామంలో సమస్యల పరిష్కారానికి జేఏసీ ఏర్పాటు చేశారు. సోమవారం గ్రామస్తులు సమావేశమై గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కమిటీ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. జేఏసీ చైర్మన్‌గా నందుయాదవ్, వైస్ చైర్మన్‌గా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, కార్యదర్శిగా ఉస్మాన్, సలహాదారుడిగా ఆంజనేయులు 14 మంది సభ్యులను నియమించారు.

ఉమాపతికి అవార్డు

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన మాలలు ఉమాపతాచార్యులుకు అవార్డు రావడంతో ఘనంగా సన్మానించారు. ఈ నెల 24న నల్లగొండ చౌటుప్పల్ గ్రామస్తులు సిద్ధాంత కళా సామ్రాట్ వాస్తు జ్యోతిర్విద విశారద బిరుదు అంకితులు బ్రహ్మశ్రీ యదునోదు నర్సింహాచార్య సిద్ధాంతి జయంతిని పురస్కరించుకొని విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఉమాపతాచార్యులు ఉత్తమ ప్రతిభ కనబర్చి నాగర్‌కర్నూల్ జిల్లా విశ్వబ్రాహ్మణ పురోహితులైన ఉమాపతాచార్యులను, పోలోజు రామాచార్యులను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

మధ్యాహ్న భోజనం వివరాలు పంపండి



తిమ్మాజీపేట: మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సకాలంలో పంపించాలని మండల విద్యాధికారి సత్యనారాయణశెట్టి సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పలు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వివరాలు, విద్యార్థుల హాజరు స్థితిని ప్రతి రోజు విధిగా సకాలంలో పంపించాలన్నారు. నేషనల్ అచీవ్‌మెంటు సర్వే తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జిల్లా వైస్ గవర్నర్‌గా రమేష్

కల్వకుర్తిరూరల్: వాసవీ క్లబ్ ఇంటర్‌నేషన్ వి108 వైస్ గవర్నర్‌గా కల్మిచర్ల రమేష్ సోమవారం నియామకమయ్యారు. ఆయన సేవలను గుర్తించి జిల్లా వైస్ గవర్నర్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సామాజిక సేవలు అన్ని వర్గాలకు విస్తరించి ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా రమేష్‌ను వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, ఇంటర్‌నేషనల్ అడిషనల్ అడిషనల్ ట్రెజరర్ కల్వ హరికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

గౌడ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని వాసవీ ఫంక్షన్‌హాల్లో నియోజకవర్గంలోని గౌడ కులానికి చెందిన ఉద్యోగులు సోమవారం సమావేశమయ్యారు. ఉద్యోగులు సంఘటితంగా ఉండాలని తీర్మానించారు. అనంతరం జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు సంజీవ గౌడ్ సమక్షంలో కొల్లాపూర్ నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా అలువాల అర్జున్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గోవింద్‌గౌడ్, గౌరవ అధ్యక్షులుగా రామన్‌గౌడ్, కోశాధికారిగా సురేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శివన్నగౌడ్, వేణుమాధవ్‌గౌడ్, ,శ్రీనివాస్‌గౌడ్, రాజన్‌గౌడ్, ప్రచార కార్యదర్శిగా శంకర్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా రాజు, భగవాన్, కర్ణాకర్, నర్సింహ్మ, నాగరాజు గౌడ్‌లు, సలహాదారులుగా ఉమాశంకర్, చంద్రశేఖర్, వెంకట్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.

పేదలను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సోమవారం అఖిల భారత ప్రజా మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో రేషన్ దుకాణంలో ప్రభుత్వం ఇస్తున్న సరుకులపై సర్వే చేసినట్లు ఐద్వా మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో నిత్యవసరాల వస్తువులు ఇచ్చేవారని, ప్రస్తుతం పేద ప్రజలకు రేషన్ బియ్యం ఇచ్చి చేతులెత్తేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు రూ.2500 అమలు చేయాలని, లేదంటే మహిళా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు.కార్యక్రమంలో పద్మ, శ్వేతమ్మ, చిన్నమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ, హక్కులపై అవగాహన

లింగాల: గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని అంబట్‌పల్లిలో బాలల రక్షణ, లైంగిక పునరుత్పత్తి ఆరోగ్య హక్కులపై పాఠశాల ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లకు, ఆస్పత్రి కమ్యూనిటీ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమ సమితి చైర్మన్ లక్ష్మణ్‌రావు మాట్లాడారు. లైంగిక పునరుత్పత్తి, ఆరోగ్య హక్కుల గురించి సీడీపీఓ దమయంతి, వైద్యాధికారి అనిల్ సూచనలు ఇచ్చారు. బాలల సంక్షేమ సమితి సభ్యులు విష్ణు, తిరుపాల్, ప్రమీల పాల్గొన్నారు.

పొగాకు నష్టాలపై అవగాహన

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని గగ్గలపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం పొగాకు, గుట్కా, సిగరెట్ వల్ల వచ్చే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల 200 రకాల రసాయనాలు మానవ శరీరంపైన దుష్పరిణామాలు కలిగిస్తాయన్నారు. నోరు, పళ్ళు, గొంతు, ఊపిరితిత్తులు, రక్తపు క్యాన్సర్ వ్యాధులు సోకుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూపారాణి, వెంకట ర్, వెంకటేశ్వర్లు, జ్యోతి, దేవరాజు, సంధ్య, శేఖర్, రమాదేవీ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి

చారకొండ: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతుగా నిరంతరం కృషి చేస్తానని వెల్దండ సింగిల్ విండో చైర్మన్ ఉడుతల భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని జూపల్లి జెడ్పీఎచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో కొన్ని రోజుల క్రితం పాఠశాలను సందర్శించారు. హైస్కూల్‌లో వారి తండ్రి జంగారావు జ్ఞాపకార్థం కళామందిరం(డైయాస్), ప్రాథమిక పాఠశాలలో శుద్ధజలం తాగేందుకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, సోమవారం వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఝాన్సీరాణి, ఎచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు, నాయకులు కమాలాకర్ రావు, బాల్‌రాజు, సిరాజ్, బిక్షపతి, కొండల్ ఉన్నారు.

బీసీ కాలనీలో ఇంటి నెంబర్ ఇవ్వాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ పట్టణంలోని బీసీ కాలనీలో ఇళ్ళు నిర్మించుకున్న లబ్ధిదారుల ఇళ్లకు ప్రభుత్వం ఇంటి నెంబర్ కేటాయించాలని సోమవారం అదనపు కలెక్టర్ దేవసహాయానికి సీపీఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న వారికి తక్షణం ఇంటి నెంబర్ ఇవ్వాలని, కాలనీలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కేవీపీఎస్ పాల్గొన్నారు.

హామీల అమలు కోసం పోరాడుదాం

నాగర్‌కర్నూల్‌రూరల్: శాసనసభ ఎన్నికల ముందు ప్రస్తుత ప్రభుత్వం రవాణా రంగ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు పోరాడుదామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం డ్రైవర్లకు 12వేల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 27న ఆటో డ్రైవర్లతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఆర్‌డీఓ

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఐతోల్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆర్‌డీఓ సురేష్, తహసీల్దార్ కిరణ్మై సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఐకేపీ సిబ్బంది శేఖర్, లక్ష్మణ్ ఉన్నారు.

పింఛన్లు ఇవ్వాలని వృద్ధుల నిరసన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండంలో వృద్ధులకు నెలాఖరు వచ్చినా పింఛన్లు ఇవ్వడం లేదని సీపీఎం గ్రామ కమిటీ అధ్వర్యంలో గ్రామ పంచాయతీ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు అశోక్ నాయక్ మాట్లాడారు.